"ఇంకా పది రూపాయలుండాలి! ఎలా తగ్గాయి? భార్య దగ్గర ఇలా మోసం చేసి డబ్బు తీసుకునే వాళ్లు మీరొక్కరే! అందుకే మిమ్మల్ని బజారు పంపాలంటే చాలా భయంగా వుంది."

తల్లి పెద్దగా అరుస్తోంటే గధిలో చదువుకుంటున్న జ్యోతి లేచి హాల్లోకి వచ్చింది.

హాల్లోని దృశ్యం చూసి - అప్రయత్నంగా ఒక అడుగు వెనక్కు వేసింది!

తల్లి రెండు చేతులూ నడుం మీద పెట్టుకుని తండ్రివేపు తీవ్రంగా చూస్తోంది. తండ్రి ఆమెకెదురుగా దోషిలా తల వంచుకుని నిలబడి వున్నాడు.

"అది కాదు విజయా... నువ్వు పొరబడుతున్నావ్" అంటూ ఏదో చెప్పబోయాడు.

"మీరెన్నయినా చెప్పండి! మీరు చేసిన పనేమీ బాగాలేదు!" అంటూ విజయ లోపలికి వెళ్లిపోయింది.

జ్యోతి - తన గదిలోకి వచ్చేసింది. ఇక ఆ పై చదవాలన్పించలేదు.

"అమ్మ ఎందుకిలా రోజూ నాన్నమీద పోట్లాడుతుంది?" ఆ చిన్నారి మనస్సులో సందేహం తలెత్తింది. పన్నెండేళ్ల జ్యోతి... దాన్నిగూర్చి ఆలోచిస్తూ... చాలా రాత్రి వరకూ నిద్ర పోలేకపోయింది!

• • • • •

"ఏరా శ్రీకాంత్! మీరిద్దరూ ఎందుకిలా తరుచూ పోట్లాడుకుంటారు?" శ్రీకాంత్ స్నేహితుడు సారధి అడిగాడు.

"నేను పోట్లాడుతున్నానా?"

"అబ్బే... నువ్వని కాదు,"

శ్రీకాంత్ నవ్వి - "అర్థమైంది కదా! నేనిక్కడి నుండి వెళ్లిపోదామనుకుంటున్నాను," అన్నాడు.

"ఎక్కడికి?"

"మా మెయిన్ బ్రాంచి కలకత్తాలో వుంది కదా! అక్కడ నాకు ఉద్యోగం వస్తుంది."

"ఏం ఉద్యోగం ఇస్తారు?"

"అటెండరు ఉద్యోగం ఇచ్చినా చేస్తాను. ఇక ఇక్కడ వుండటం నావల్ల కాదు." ఆ మాట అంటోంటే శ్రీకాంత్ గొంతు బొంగురుపోయింది!

సారధి అతని భుజం మీద చెయ్యి వేశాడు. "శ్రీకాంత్! నీబాధ నాకు తెలుసు. నువ్వు ఇటువంటి నిర్ణయం తీసుకున్నందుకు నాకు చాలా ఆనందంగా వుంది. విజయ నీతో వస్తుందా?" సారధి ప్రశ్నకు శ్రీకాంత్ కొద్దిసేపు మౌనం వహించాడు. ఆ తర్వాత-

"విజయ నాతో రాకపోవచ్చు!" అన్నాడు.

"అయితే నువ్వొక్కడివే వెడతావా?"

"అవును! ఆమె జీవితం ఆమె ఇష్టం! ఆమె వచ్చినా - రాకపోయినా నేను వెళ్లడానికే నిశ్చయించుకున్నాను." శ్రీకాంత్ దృఢంగా అన్నాడు.

"మీ పంతాలు పట్టింపుల మధ్య చిన్నపిల్ల జ్యోతి నలిగిపోతుంది!" సారధి బాధపడ్డాడు.

"సారధీ! ఇన్నాళ్లూ జ్యోతి కోసమే విజయతో రాజీ పడి బ్రతుకుతున్నాను. కానీ ఇక భరించడం నావల్ల కాదు. నౌకరు కంటే హీనంగా చూస్తోంటే ఎలా బ్రతికేదిరా! నేనీ ఇంట్లో వుండటమే ఆమెకు ఇష్టం లేదు. వూరికే కూర్చుని, తింటున్నానని ఆమెకు కోపం! పోనీ ఇక్కడే చిన్న ఉద్యోగం చేద్దామంటే ఆమె ఆఫీసరు హోదాకి అది భంగకరం! అటువంటి పనులు చెయ్యకూడదు... ఇంకెలా చచ్చేది?"



# కరిగి నీరయింది

— విన్నకోట సుశీలాదేవి

బాధని దిగమ్రింగుకుంటూ కొద్దిసేపు గడిచాక మళ్లీ అన్నాడు -

"నేనీ ఇంట్లో వుండటమే ఆమెకు చాలా అవమానంగా వుంది. నేను వెళ్లిపోతే చాలా సంతోషిస్తుంది,"

"కానీ జ్యోతి..."

"ఆవిడ బ్యాంకు మేనేజరు కదా! ఆమె హోదాకి తగ్గట్టుగానే, జ్యోతిని బాగా పెంచుతుందిలే," అంటూ కుర్చీలో వెనక్కి వాలి కళ్లు మూసుకున్నాడు శ్రీకాంత్.

స్నేహితుడి వేపు జాలిగా చూశాడు సారధి. మాసిన గడ్డం, మురికిగా వున్న బట్టలు... విషాదం - వైరాగ్యం మూర్తీభవించిన వ్యక్తిలా వున్నాడు.

ఎటువంటివాడు ఎలా మారిపోయాడు!

మడత నలగని బట్టలు వేసుకుని - కళ్లకి గాగుల్స్‌తో అందంగా హుందాగా స్కూటర్ మీద తిరిగే స్నేహితుడి జీవితం ఎలా అయిపోయింది?...

ఈ స్థితి వస్తుందని ఎవరూ కలలో కూడా అనుకోలేదు!

విధి ఎంత విచిత్రమైనది!

భార్యాపిల్లలతో హాయిగా జీవితం గడపాల్సిన శ్రీకాంత్ వాళ్లను వదిలి ఒంటరిగా ఎక్కడో కలకత్తాలో ఎలా వుండగలడు?

అసలు ఈ స్థితికి కారణం విజయ! భర్త రెండుచేతులా సంపాదిస్తోంటే అతడిని దేవుడిలా పూజించింది; అతడికి ఉద్యోగం పోగానే పురుగులా విదిలించి కొట్టోంది!

భార్యాభర్తల మధ్య కూడా డబ్బుంటేనే గౌరవ మర్యాదలా? అయితే ఇక వివాహ బంధానికి అర్థం ఏవుంది? ఈ ఆధునిక సమాజంలో అన్ని రంగాల్తో పాటు పెళ్లి కూడా వ్యాపారంగా మారిపోయింది.

"సారధీ! ఏమిటీ ఆలోచిస్తున్నావ్," శ్రీకాంత్ అడిగాడు.

"ఏం లేదురా! నువ్వు దూరంగా వెళ్లిపోతున్నావంటే బాధగా వుంది! కానీ అక్కడైనా సుఖంగా వుంటావనే తృప్తిగానూ వుంది,"

శ్రీకాంత్ సారధి భుజం మీద చెయ్యి వేసి... "ఈ చీకట్లో వెలుగురేఖలు నువ్వు - జ్యోతీ.... మీరిద్దరూ లేకపోతే... ఎప్పుడో ఆత్మహత్య చేసుకునే వాడిని," అన్నాడు!

"ఛ... అవేం మాటల్రా! సమస్యలకు పరిష్కారం చావు కాదు..." ఇంకెప్పుడూ అటువంటి ఆలోచనలు రానీకు..." సారధి నొచ్చుకుంటూ అన్నాడు.

శ్రీకాంత్ మాట్లాడలేదు.

ప్రక్క గదిలో కూర్చుని, చదువుకుంటున్న జ్యోతి వాళ్ల మాటలు వింటూ చదువు విషయం మర్చిపోయింది. నాన్న మాకు దూరంగా ఎక్కడికో వెళ్లిపోతున్నాడా? నాన్న లేకుండా నేనెలా వుండగలను? అమ్మ నాన్నతో పోట్లాడకుండా వుంటే నాన్న ఇక్కడే వుండిపోతాడు కదా! అమ్మ మారిపోతే బాగుండును...' అంటూ ఆలోచించసాగింది.

• • •

శ్రీకాంత్ ఒక ప్రయివేట్ ఫర్మ్‌లో సేల్స్ మేనేజర్‌గా పనిచేసేవాడు. నాలుగంకెల జీతం! హాయిగా సాగిపోతున్న అతడి జీవితం - విధి వక్రించడంతో తుఫానుకు లోనయింది! అనుకోకుండా నష్టాలు రావడంతో కంపెనీ మూసేశారు.

దాంతో అతని పరిస్థితి తారుమారయింది. అప్పుడే విజయకు బ్యాంకు మేనేజరుగా ప్రమోషన్ వచ్చింది. హోదా పెరగడంతో ఆమెలో గర్వం - అతిశయం చోటు చేసుకున్నాయి. ఉద్యోగం లేని భర్తని చులకనగా చూడసాగింది.

శ్రీకాంత్ ఆ ఇంట్లో నౌకరుగా మారాడు. మొదట్లో విజయపై ప్రేమకొద్దీ ఆమె విసుగునీ - చిరాకునీ పట్టించుకోలేదు. కానీ రానురాను ఆమె తిరస్కారం భరించలేకపోయాడు. ఆమెపైన వున్న ప్రేమ కరిగిపోయింది!

ఒకసారి...

స్నేహితురాలి ఇంట్లో పార్టీకి వెళ్లింది విజయ.

అక్కడ ఒకావిడ,

"విజయా! మీవారిప్పుడు ఏం చేస్తున్నారు?" అనడిగింది.

"ఇప్పుడా! బహుశ ఇంట్లో వంట చేస్తుంటారు!" అంటూ కిసుక్కున నవ్వింది స్నేహితురాలు కల్పన.

"అదేమిటి?"

"ఉద్యోగం లేనివాళ్లు అంతకంటే ఏం చేస్తారు?" అంది కల్పన.

ఆవిడ ఆశ్చర్యపోతూ -

"ఏం విజయా? మీవారికి ఉద్యోగం లేదా! చాలా ఆశ్చర్యంగా వుందే! అసలటువంటి వ్యక్తిని ఎలా భరిస్తున్నావ్! నీ అందం - హోదాకు ఏ డాక్టరో, ఇంజనీరో, ఆఫీసరో, భర్తగా రావాల్సింది. ప్చ్! అంతా దురదృష్టం" ఆవిడ విచారపడ్తోంది!

విజయ వినలేకపోయింది.

ఇంటికొచ్చాక చాలాసేపు అదే తలుచుకుని చాలా బాధపడింది.

ఇటువంటి సంఘటనలు రెండు - మూడు ఎదురయినప్పటి నుండీ భర్తంటే చులకన భావం ఏర్పడింది.

నిజంగా తను దురదృష్టవంతురాలు... శ్రీకాంత్ తన హోదాకి తగిన వ్యక్తి కాదు. ఈయన మూలంగా తనకెన్ని అవమానాలు ఎదురవుతున్నాయి. ఇక్కడే... ఏ అటెండర్ పనయినా చేస్తానంటాడు. అది తనకెంత పరువు నష్టం... ఆ చేసేది ఇంకే వూర్లో చేసినా బాగుండును... ఏదో పెద్ద ఆఫీసరు హోదాలో వున్నాడని అబద్ధం చెప్పొచ్చు.... అందరూ నమ్ముతారు. కానీ ఈ విషయం ఆయనకెలా చెప్పాలి?

విజయ తనలో తను మధనపడసాగింది!

• • •

"జ్యోతీ... ఇలారా?" ఒకరోజు సాయంత్రం వేళ బ్యాంకు నుండి రాగానే కూతురిని పిలిచింది విజయ.

ఆ సమయంలో జ్యోతి వరండాలో - తండ్రితో కలిసి టేబుల్ టెన్నిస్ ఆడుతోంది. తల్లి అరుపుకు భయపడుతూ పరుగెట్టుకు వచ్చింది.

"జ్యోతీ! ఏం చేస్తున్నావ్?"

"ఆడుకుంటున్నానమ్మా!"

జ్యోతి చెంప ఛెళ్లుమంది.

ఆ దెబ్బతో, నవ్వుతున్న జ్యోతి కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

"నేను చెప్పిందేమిటి? నువ్వు చేసేదేమిటి? స్కూలు నుండి రాగానే హోమ్‌వర్క్ చేసుకోవాలని చెప్పానా? లేదా?" తీవ్రంగా అడిగింది.

"ఇవ్వాళ హోమ్‌వర్క్ ఏమీ లేదమ్మా!"

"అయితే ఇంకేమన్నా చదువుకోవాలి. ఇవ్వాళ నీవల్ల నాకెంత అవమానం కలిగిందో తెలుసా! మా బ్యాంకులో పనిచేసే క్లర్కు కూతురికి ఫస్టుర్యాంకు... నీకు నాలుగో ర్యాంకు వచ్చింది! అతడా విషయం అందరిలో గర్వంగా చెప్పాడు. ఛ... మీరందరూ కలసి నా పరువు తీస్తున్నారు. అతడా విషయం చెప్పగానే నాకెంత అవమానం కలిగిందో తెలుసా! నేను కష్టపడి అన్నీ అమర్చిపెడుతోంటే చదవడానికి నీకేం బాధ. తేరగా తిని తిరగడం అలవాటైంది... మీవలన నేను నలుగురిలో తలెత్తు కోలేకుండా వున్నాను. ఇంకొకసారి ఆడుకున్నట్లు కనబడ్డావో చంపేస్తాను. ఈసారి నీకు ఫస్టు రాంకు ర్యావాలి! నలుగురిలో నా పరువు నిలబడాలి... గుర్తుంచుకో," అంటూ లోపలకు వెళ్లిపోయింది విజయ.

జ్యోతి దిగాలుగా నిల్చుంది.

బయట నిలబడి అంతా వింటున్న శ్రీకాంత్ - విజయ అన్న మాటలన్నీ తనకు కూడా వర్తిస్తాయని గ్రహించుకున్నాడు.

ఇన్ని రోజుల నుండీ అతని మనసులో చెలరేగుతున్న సంఘర్షణకి ఆ క్షణంలోనే తెర పడింది!

• • • • •

"జ్యోతీ ఈరోజు రాత్రికి నేను కలకత్తా వెడుతున్నానమ్మా!" అన్నాడు శ్రీకాంత్.

"ఎందుకు నాన్నా?"

"అక్కడ ఆఫీసులో పనుందమ్మా! మళ్ళీ కొద్దిరోజుల్లో వచ్చేస్తాను," అన్నాడు.

జ్యోతి బాధపడుతుందని, నిజం చెప్పలేకపోయాడు శ్రీకాంత్. కానీ అది అబద్ధమని జ్యోతికి తెలుసు.

"నిజంగా మళ్లీ వస్తావా? నాన్నా!"

"ఆ!"

"ఎన్ని సంవత్సరాల తర్వాత!"

శ్రీకాంత్ ఉలిక్కిపడ్డాడు! కూతురిని దగ్గిరకు తీసుకుని "అదేమిటమ్మా! సంవత్సరాలెందుకు?" తడబడుతూ అన్నాడు.

"నాన్నా! నాకంతా తెలుసు. నువ్వూ - అంకుల్ మాట్లాడుకుంటుంటే విన్నాను. నాన్నా! నన్ను విడిచి వెళ్లిపోతావా! నువ్వు లేకపోతే నేనిక్కడ ఎలా వుండగలను?" అంటూ జ్యోతి తండ్రి మెడ చుట్టూ చేతులు వేసింది.

ఆ ప్రేమకు అతని మనస్సు వర్షించే మేఘమైంది. జ్యోతి తల నిమురుతూ -

"జ్యోతీ నిన్ను విడిచి నేనూ వుండలేనమ్మా కానీ తప్పదు..." అన్నాడు దుఃఖంతో.

"అందుకే నేను కూడా నీతో వస్తున్నాను. నా సూట్‌కేస్ కూడా సర్దేసుకున్నాను," అంది జ్యోతి!

అది విని శ్రీకాంత్ నివ్వెరపోయాడు.

"జ్యోతీ..."

"అవున్నాన్నా! నేను లేకపోతే నువ్వు కూడా వుండలేవు కదా!"

"అది కాదమ్మా జ్యోతీ!... మీ అమ్మ..."

"అమ్మకు మనం అక్కర్లేదు నాన్నా! డబ్బుంటే చాలు. ఈసారి ఫస్టు ర్యాంకు. రాకపోతే నన్ను నిజంగా చంపేస్తుంది" అంది దిగులుగా.

"ఛ! మీ అమ్మ వూరికే అలా అంటుంది. నువ్వంటే చాలా ప్రేమ!"

"ఏం ప్రేమ లేదు... అమ్మకు డబ్బు - పరువు కావాలి. డబ్బు లేదని నిన్ను తిట్టోంది. నాకు ఫస్టు ర్యాంకు రాకపోతే ఆవిడ పరువు పోతుందిట. నాన్నా! అమ్మకి మనమంటే ఇష్టం లేదు. ఆవిడకు మనం అక్కర్లేదు..."

జ్యోతి చిన్న మనసులో తల్లిపై ఎంత కోపం వుందో అర్థమైంది శ్రీకాంత్‌కు. జ్యోతికెలా నచ్చ చెప్పాలో తెలీలేదతనికి...

"జ్యోతీ..."

"నాన్నా! ఇంకేం మాట్లాడకు. నేను నీతో రావడం ఖాయం. తీసుకెళ్లకపోతే నామీద ఒట్టే" అంది బెదిరింపుగా.

"జ్యోతీ! అంత ఒట్టు పెట్టుకోకు. అలాగే నిన్ను తీసుకెడతానమ్మా" జ్యోతి రెండు చేతుల్నీ పట్టుకుని ముద్దు పెట్టుకుంటూ అన్నాడు.

• • • • •

సారధి స్టేషన్‌కి వచ్చాడు.

"ఏరా! శ్రీకాంత్ వెళ్లిపోతున్నావా." శ్రీకాంత్ చెయ్యి పట్టుకుని... అతని కళ్లల్లోకి బాధగా చూస్తూ అన్నాడు.

సారధిని ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు.

"నిన్ను వదిలి వెడుతున్నందుకు చాలా విచారంగా వుందిరా."

"విజయతో చెప్పావా?"

"ఆ... నేను వెడుతున్నట్లు తెలుసు కానీ, జ్యోతి వస్తున్నట్లు తెలీదు. ప్రస్తుతం ఆవిడ వూళ్లో లేదు. హైదరాబాద్‌లో కాన్ఫరెన్సు వుంటే వెళ్లింది. రేపు వస్తుందేమో. వచ్చాక తెలుస్తుంది. నేనూ, కూతురు కావాలనుకుంటే కలకత్తా వస్తుంది. లేకపోతే లేదు... అంతే..." అన్నాడు శ్రీకాంత్.

సారధి మాట్లాడలేదు.

"సారధీ! నేను రెండు మూడు ఏళ్లు మాత్రమే కలకత్తాలో వుంటాను. ఆ తర్వాత ఎక్కడ వుంటానో?" సాలోచనగా అన్నాడు శ్రీకాంత్.

"అదేమిటి? ఎక్కడికెళతావ్." సారధి ఆశ్చర్యంగా అడిగాడు.

"ఇప్పుడే చెప్పలేను. నా మనసులో ఎన్నో ప్రణాళికలు వున్నాయి." ఎటో చూస్తూ అన్నాడు.

"నాకు ఉత్తరాలు రాస్తూంటావు కదూ."

"అది చెప్పాలా?" నవ్వుతూ అన్నాడు.

ఇంతలో రైలు వస్తున్నట్లు మైకులో ఎనౌన్స్‌మెంటు ఇవ్వబడింది.

శ్రీకాంత్ జ్యోతిని దగ్గరకు తీసుకుని రాబోయే రైలు కోసం ఎదురుచూడసాగాడు.

• • • • •

పై సంఘటన జరిగిన పదేళ్ల తర్వాత-

ఒకరోజు -

విజయ ఒక శుభలేఖ అందుకుంది!

అది జ్యోతి పెళ్లి శుభలేఖ!

శ్రీకాంత్ ఏకైక పుత్రిక జ్యోతి పెళ్లని దాన్లో రాసి వుంది! తల్లి పేరు ఎక్కడా లేదు.

శుభలేఖని చూడగానే విజయకు ఒక్కసారి దుఃఖం గుండెల్లో నుండి పొంగి పొరలింది.ఆపుకోలేక వెక్కివెక్కి ఏడవసాగింది.


ఇన్నేళ్ల దుర్భరమైన ఒంటరి పయనంలో ఎన్నో ఎదురుదెబ్బలు తగిలాయి.


అహంకారపు పొరలు జారిపోగా పశ్చాత్తాపంతో మనస్సు కుమిలిపోయింది.


ఈనాడామె రెక్కలు తెగిన ఒంటరి పక్షి.

"ఆ దేవుడు ఒక్కసారి నాకు మళ్లీ నా జీవితం ప్రసాదిస్తే ఎంత బాగుండును." అనుకుంటూ చెమ్మగిల్లిన కళ్లతో - ఆ శుభలేఖని ఆప్యాయంగా పెదవులకు తాకించుకుంది విజయ. ❁

# సంక్రాంతి ముగ్గులు









ఉమాశివ
విజయవాడ